ఇద్దరు ఆర్డీవోల స్థానచలనం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇద్దరు ఆర్డీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ఆర్డీవో జీవీ.సుబ్బారెడ్డిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న కంబాలకుంత లక్ష్మీప్రసన్నను నియమించారు. సుబ్బారెడ్డిని తదుపరి పోస్టింగ్ నిమిత్తం రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

◗ కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను కడప ఆర్డీవోగా బదిలీపై వెళ్లనున్నారు. ఆయన స్థానంలో నూతనంగా జి.కేశవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన అంతకుముందు అమలాపురంలో విధులు నిర్వహించారు.



ఆరోగ్యానికి 'ఆహా'రం...: పౌష్టికాహారంపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శనకు ఉంచిన ఆహార పదార్థాలు నోరూరించడమే కాకుండా.. రుచిలోనూ అందరితో ఆహా అనిపించాయి. - న్యూస్‌టుడే, దర్శి

కొలిక్కొచ్చిన జడ్పీ ఉద్యోగుల బదిలీలు!

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజా పరిషత్ ఉద్యోగుల బదిలీల కసరత్తు ఓ కొలిక్కి వచ్చింది. గత వారం రోజులుగా ఉద్యోగుల బదిలీల విషయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ వైనంపై కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు జడ్పీ సీఈవో మాధురి గురువారం బదిలీల ప్రక్రియను వేగవంతం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాలు ఉండగా., అందులో మూడింటికి సంబంధించిన ఎంపీడీవోల పోస్టింగులపై చిక్కుముడి వీడలేదు. అటెండర్లు, టైపిస్టులు, జూనియర్ సహాయకుల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది.

పర్యాటక ప్రకాశం





- దర్శనీయ స్థలాల అభివృద్ధికి ప్రణాళికలు
- 2029లోపు పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో రూ.33.50 కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు

యాభై రెండు కి.మీ మేర ఉన్న సముద్ర తీర ప్రాంతం ప్రకాశం జిల్లాకు ఓ ఆభరణం. అయిదు మండలాల పరిధిలో బీచ్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాలు ప్రత్యేకం. గుండ్లకమ్మ జలాశయంతో పాటు, సీఎస్‌పురం మండలం భైరవకోనలు దర్శనీయం. సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ నరసింహస్వామి, త్రిపురాంతకం బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయాలు ఎంతో ప్రాశస్త్యనీయం.. అభివృద్ధికి అనుకూలం. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం ఈ దిశగా కొంత మేర పనులు చేపట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. పూర్తి నిర్లక్ష్యం వహించింది. అసంపూర్తిగా మిగిలిన పనులూ పూర్తిచేయించలేకపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పర్యటక రంగం అభివృద్ధి దిశగా దృష్టి సారించింది. ఈ మేరకు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రాధాన్యమిచ్చింది. ఈ మేరకు రానున్న అయిదేళ్లలో రూ.33.50 కోట్లతో అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అవి పూర్తయితే పర్యటకులకు అన్ని వసతులతో పాటు; నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. శుక్రవారం ప్రపంచ పర్యటక దినోత్సవం.. ఈ నేపథ్యంలో జిల్లాలో చేపట్టనున్న పనులను తెలుపుతూ కథనం. -న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం-సింగరాయకొండ గ్రామీణం

తీరం.. కానుంది ఆహ్లాదం




ప్రాంతం...: పాకల, కొత్తపట్నం బీచ్‌లు

- **ప్రతిపాదిత నిధులు...:** రూ.11 కోట్లు
- **విశేషాలు...:** సెలవు, ఆదివారాల్లో కొత్తపట్నం, సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లు పర్యాటకులతో సందడిగా మారతాయి. వారాంతపు సెలవు దినాల్లో కుటుంబ సభ్యులతో కలిసి సేదతీరేందుకు వెళ్తుంటారు. ఆ రెండు రోజుల్లో కనీసం మూడు వేల మందికి పైగా సందర్శకులు ఉంటుంటారు.
- **ఇవీ సమస్యలు...:** విశ్రాంత గదులు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి కనీస వసతులూ లేవు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలన్నా, ప్రత్యేకించి మహిళలు సముద్ర స్నానం అనంతరం దుస్తులు మార్చుకోవాలన్నా ఇబ్బందిగా మారింది.
- **పడకేయించిన వైకాపా...:** 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో పాకల బీచ్‌లో విశ్రాంతి భవనం, రెస్టారెంట్, సీసీరోడ్డు, ఎల్ఈడీ దీపాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి. తొలి విడతగా రూ.1.60 కోట్లతో పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో మధ్యలోనే నిలిచిపోయాయి.
- **త్వరలో సుందరీకరణ షురూ...:** అసంపూర్తి పనుల పూర్తికి రూ.3 కోట్లతో ప్రతిపాదించారు. పాకల తీరం అభివృద్ధి నిమిత్తం మరో 15 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. 2026-27 సంవత్సరం నాటికి కాటేజీలు, రెస్టారెంట్, ఉద్యాన వనం, బల్లల ఏర్పాటుతో పాటు; సుందరీకరణకు రూ.8 కోట్లతో అంచనా వేశారు. 2025-26 సంవత్సరం నాటికి రూ. 6 కోట్లతో కొత్తపట్నంలో అతిథి గృహం నిర్మించాలని ప్రతిపాదించారు.

ఆంధ్రకేసరికి అగ్రాసనం...




- **గ్రామాలు...:** వినోదరాయునిపాలెం, దేవరంపాడు
- **ప్రతిపాదించిన నిధులు...:** రూ. 6 కోట్లు
- **చేపట్టనున్న పనులు...:** ఒంగోలు మండలం దేవరంపాడు సమీపంలోని ఉప్పు సత్యాగ్రహ విజయ స్తూపాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చాలని నిర్ణయించారు. ఇందుకుగాను అక్కడ సుందరీకరణ, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేయనున్నారు. రూ. 3 కోట్ల నిధులతో 2027-28 సంవత్సరానికి పూర్తిచేసేలా అంచనా వేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు స్వగ్రామమైన నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలెంలో ఆయన జీవిత విశేషాలు తెలిపేలా రూ.3 కోట్లతో మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.



ఆలయాలకు ఎనలేని ప్రాశస్త్యం...

- **ప్రదేశాలు...:** భైరవకోన, త్రిపురాంతకం
- **ప్రతిపాదిత నిధులు...:** రూ. 2.50 కోట్లు
- **ఘన చరిత...:** సీఎస్‌పురం మండలం భైరవకోనలో త్రిముఖ దుర్గాంబదేవి కొలువై ఉన్నారు. చోళుల కాలంలో ఇక్కడ ఒకే రాతిపై నిర్మించిన ఎనిమిది ఆలయాలు ప్రత్యేకం. పక్కనే ఉన్న జలపాతం వర్షాకాలంలో కనువిందు చేస్తుంటుంది. కార్తిక మాసంతో పాటు, మహాశివరాత్రి రోజున భక్తులు ఆ నీటిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇతర రోజుల్లోనూ జిల్లా వాసులతో పాటు, పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.



భైరవకోనలోని చోళుల కాలం నాటి శైవక్షేత్రం

- **గదులు.. కాటేజీలు...:** 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరవ్వగా., వాటితో చేపట్టిన విశ్రాంతి గదులు, జలపాతం అభివృద్ధి, కాటేజీ, పరిపాలనా భవనాల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ ఏడాది తాజాగా అదనపు గదులు, రెస్టారెంట్ నిర్మాణానికి రూ.కోటి నిధులతో అంచనాలు రూపొందించారు. 2028-29 సంవత్సరానికి త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయ అవరణలో కాటేజీలు, ఉద్యాన వనం అభివృద్ధికి రూ.1.50 కోట్లతో అంచనా వేశారు.

గుండ్లకమ్మ.. మరింత సుందరం...

ప్రాంతం...: గుండ్లకమ్మ జలాశయం

- **నిధులు...:** రూ. 8 కోట్లు
- **విశేషాలు...:** ఒంగోలు నగరానికి సమీపంలోనే గుండ్లకమ్మ జలాశయం ఉంది. ఆదివారంతో పాటు, ఇతర సెలవు దినాల్లో నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ఆహ్లాదంగా గడిపేందుకు పలువురు ఇక్కడికి వస్తుంటారు. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి పర్యాటకుల తాకిడి ఎక్కువ.
- **ప్రారంభానికి మోకాలడ్డి...:** పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2009లో బోటింగ్ ఏర్పాటు చేశారు. పర్యాటక అభివృద్ధికి అన్నంగి వద్ద సుమారు 13 ఎకరాల భూమిని కేటాయించారు. అయిదు ఎకరాల్లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2.63 కోట్ల నిధులతో 8 కాటేజీలు, రెస్టారెంట్, ఈత కొలను నిర్మించారు. అయినా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇవేమీ ప్రారంభానికి నోచుకోలేదు.
- **విహరించేలా.. కొండలెక్కేలా...:** ఈత కొలను, కాటేజీలు వినియోగంలోకి తేవాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2028-29 సంవత్సరం నాటికి కొండపై ఒంగోలు గిత్త బొమ్మతో పాటు; ఉద్యాన వనం, రోప్ వేతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటితోపాటు కొండ ఎక్కేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. వీటన్నింటినీ రూ.8 కోట్లతో పూర్తిచేయాలని ప్రతిపాదించారు.



ఊడిన ఫ్యాన్ రెక్కలు

◗ జనసేన గూటికి బాలినేని, కంది

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమితో దిక్కు తోచని స్థితిలో ఉన్న వైకాపాకు జిల్లాలో మరో పెద్ద దెబ్బ తగిలింది. ఇప్పటివరకు ఆ పార్టీకి జిల్లాలో పెద్ద దిక్కుగా భావించే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన గూటికి చేరారు. గురువారం సాయంత్రం 5 గంటలకు మంగళగిరి పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. ఆయనతోపాటు వైకాపా నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, గంటా రామానాయుడు కూడా జనసేనలో చేరారు. అనంతరం జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆ పార్టీ రాజకీయ వ్యవహారాలు చూస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్‌తో బాలినేని కొద్దిసేపు ముచ్చటించారు.

● **కంది.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి మళ్లీ...:** ప్రముఖ వ్యాపారవేత్త కంది రవిశంకర్ జనసేనలో చేరికతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి మళ్లీ అడుగుపెట్టారు. ముప్పై అయిదేళ్ల క్రితం యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. తర్వాత వ్యాపారంపై దృష్టిపెట్టారు. గత ఎన్నికల సమయంలో వైకాపా పర్చూరు నియోజకవర్గ బాధ్యుడిగా ఆయన్ను నియమిస్తారనే ప్రచారం సాగింది. అయితే చివరికి ఆ ఊసే లేకపోయింది. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నారు. తన వియ్యంకుడు, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్యతో కలసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో గురువారం చేరారు. కంది వెంట ఆయన కుమారులు సాయినాథ్, విష్ణుమోహన్ ఉన్నారు. తొలుత మంగళగిరి బయలుదేరే ముందు ఒంగోలు నగరంలో అభిమానులతో కలసి ప్రదర్శన నిర్వహించారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో మాజీ మంత్రి శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్త రవిశంకర్


గీత దాటిన పోలీసులపై వేటు

ఈనాడు, అమరావతి: ఒంగోలుకు చెందిన యువకుడిని వేధించిన ఘటనలో గుంటూరు డీసీఆర్‌బీ సీఐ జలాలుద్దీన్, ఇద్దరు కానిస్టేబుళ్లు చాంద్‌బాషా, షేక్ నూరుల్లాపై ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సస్పెన్షన్ వేటు వేశారు. ఒంగోలు యువకుడిపై ఆయన భార్య వేధింపుల కేసు పెట్టారు. దీంతో పోలీసులు స్పందించారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే సదరు యువకుడికి ఎలాంటి ముందస్తు అరెస్టు నోటీసులు ఇవ్వలేదు. కేసు ఉందని, అరెస్టు చేస్తున్నామంటూ ఇద్దరు కానిస్టేబుళ్లు అతన్ని వాహనంలో ఇంటి నుంచి తీసుకెళ్లారు. అనంతరం తీవ్రంగా వేధించి నిబంధనలు ఉల్లంఘించారు. పోలీసుల నుంచి తప్పించుకున్న ఆయన అదే రోజు ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన ఎస్పీ సమగ్రంగా విచారణ చేయించి, నివేదికను ఐజీకి సమర్పించారు. దీంతో ఘటనకు బాధ్యులైన సీఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకున్నారు.

పుట్టి ముంచిన మొక్కజొన్న

◗ గింజలు లేని కంకులు ◗ లబోదిబోమంటున్న రైతులు

తాళ్లూరు, న్యూస్‌టుడే: పైరు చూస్తే ఏపుగా పెరిగింది. మొక్కలకు కంకులు కూడా ఎక్కువ సంఖ్యలోనే వచ్చాయి. తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందని అన్నదాతలు ఎంతగానో సంతోషించారు. పరీక్షించేందుకు కంకుల రేకులు ఒలిచి చూస్తే మాత్రం గింజలే కనిపించలేదు. నకిలీ విత్తనాలతో మొక్కలు పుట్టి తమను నట్టేట ముంచాయంటూ కర్షకులు ఇప్పుడు కన్నీటి పర్యంతమవుతున్నారు. తాళ్లూరు మండలం తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం, మాధవరం, కొత్తపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు సుమారు 1,500 ఎకరాల్లో ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేపట్టారు. అధిక దిగుబడులు వస్తాయంటూ కంపెనీ ప్రతినిధులు చెప్పిన మాటలు నమ్మి ఓ రకం విత్తనాలను తాళ్లూరులోని ఓ దుకాణం నుంచి కొనుగోలు చేశారు. మూడు నెలలపాటు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఇప్పటి వరకు ఎకరాకు దాదాపు రూ. 30 వేల వరకు ఖర్చు చేశారు. తీరా ఇప్పుడు ఎదిగిన మొక్కలకు వచ్చిన కంకులను పరిశీలించి.. గింజలు లేకపోవడంతో మోసపోయామని గుర్తించి విషయాన్ని సదరు కంపెనీ ప్రతినిధి దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలనకు వచ్చిన సదరు ప్రతినిధితో తాళ్లూరు, కేవీపాలెం వద్ద రైతులు వాగ్వాదానికి దిగారు. నకిలీ విత్తనాల వల్లే నష్టపోయామని, కంపెనీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏవో బి.ప్రసాదరావు మాట్లాడుతూ.. మొక్కజొన్న కంకులకు గింజలు లేవంటూ కొందరు రైతులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి శాస్త్రవేత్తలతో పంటలను పరిశీలింపజేయిస్తామన్నారు. విత్తనాల్లో తేడా ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కేవీపాలెం వద్ద ఏపుగా పెరిగిన పైరు.. కంకులకు కనిపించని గింజలు



నకిలీ విత్తనాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేవీపాలెం రైతులు

జగనూ.. లడ్డూ కల్తీపై సిగ్గుపడు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలో కల్తీకి పాల్పడినట్లు సాక్ష్యాధారాలతో రుజువైనప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజకీయం చేయాలనుకుంటున్నారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. ఒంగోలులోని తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డేమో సీబీఐ విచారణ కోరతారు., ఆయన బాబాయి వైవీ.సుబ్బారెడ్డేమో తనపై విచారణే వద్దంటూ కోర్టును ఆశ్రయిస్తుంటారని ఎద్దేవా చేశారు. కలియుగ దైవం కొలువుదీరిన పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేసినందుకు జగన్ ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోవాలన్నారు. వైకాపా నేతల పాపాలను కడిగేందుకు సంప్రోక్షణ చేస్తుంటే, మళ్లీ జగన్ తిరుమలకు వెళ్లి ఎందుకు అపవిత్రం చేస్తారని ప్రశ్నించారు. తిరుమల క్షేత్రం గత వైకాపా ప్రభుత్వంలో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని ఆరోపించారు.



మాట్లాడుతున్న తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

● **శ్రీవారి దర్శనానికి డిక్లరేషన్ ఇవ్వాల్సిందే...: మంత్రి స్వామి:** అన్యమతస్థులు ఎవరైనా తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సింగరాయకొండలో గురువారం ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఆలయ ఆచారాలు, సంప్రదాయాలు పాటించాల్సి ఉంటుందన్నారు. గతంలో తిరుమల సందర్శన సమయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, నాటి యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీలు డిక్లరేషన్‌పై సంతకం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత వైకాపా పాలనలో నిబంధనలకు విరుద్ధంగా అధికార దర్పంతో ఇష్టానుసారంగా జగన్ ప్రవర్తించారని మండిపడ్డారు.

డిగ్రీ కళాశాలగా గురుకుల పాఠశాల...

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండలోని బాలికల గురుకుల పాఠశాలను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం సందర్శించారు. గురుకులం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు. అందుతున్న సౌకర్యాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాబోయే విద్యా సంవత్సరం నాటికి గురుకులాన్ని డిగ్రీ కళాశాలగా ఉన్నతీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాకల సముద్రతీరాన్ని పరిశీలించి స్వచ్ఛతా హీ సేవలో భాగంగా తీరం వెంట పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జయ, సంక్షేమాధికారి లక్ష్మానాయక్, ఈఈ భాస్కరబాబు, ప్రిన్సిపల్ రమాదేవి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సింగరాయకొండలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, కార్యదర్శి ప్రసన్న వెంకటేష్

కంపు.. చికిత్సకెళ్తే వాంతు



ఓ వార్డులో సంచరిస్తున్న శునకం

- జీజీహెచ్‌లో అధ్వాన పరిస్థితులు
- గోడలపై కిళ్లీ, గుట్కాల మరకలు

జిల్లాలో వైద్యచికిత్సలకు పెద్దదిక్కు ఒంగోలు సర్వజన ఆసుపత్రి. నిత్యం వేల సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తుంటారు. వైద్యం చేయాల్సిన చోటు ఎంతో పరిశుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉంది. జీజీహెచ్‌లో ఆ మాటే హాస్యాస్పదంగా మారింది. లోపలికి వెళ్లేందుకే రోగులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. కడుపులో తిప్పేంద దుర్వాసనతో కొందరైతే ఏకంగా వాంతులు చేసుకుంటున్నారు. అపరిశుభ్ర పరిసరాలతో పాత వాటికి తోడు కొత్త జబ్బులు వస్తాయని రోగులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

◗ **వార్డుల్లో కుక్కల విహారం...:** ఆసుపత్రిలో పురిటి బిడ్డలు, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు ఉంటారు. అలాంటి ప్రదేశంలో పరిశుభ్ర వాతావరణం ఎంతైనా అవసరం. జీజీహెచ్‌లో ఆ ఊసే లేదు. కుక్కలు ఏకంగా ప్రసూతి విభాగంలో సంచరిస్తున్నాయి. ఇన్‌పేషంట్ గదుల్లో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఏదో ఒక సమయంలో మాత్రమే నీరు అందుబాటులో ఉంటుంది. ఆ సమయంలోనే కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి. ఇన్‌పేషంట్, ఓపీ గదుల మధ్య వేసే చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి, నీటితో శుభ్రం చేయాల్సి ఉండగా.. ఆ ఊసే లేదు. ఉమ్మి, కిళ్లీ, గుట్కాలు నమిలి ఊసిన మరకలతో గోడలు అపరిశుభ్రంగా మారాయి. ఆసుపత్రిలో రోజువారీ సేకరించి వేసే వ్యర్థాల సంచులు హెచ్ఐవీ విభాగానికి సమీపంలో బహిరంగంగా నిల్వ చేస్తున్నారు. ప్రతిరోజూ తరలించకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. కుక్కలు గుంపులుగా చేరి సంచుల్లోని రక్తం అంటిన వ్యర్థాలను బయటికి లాగేస్తున్నాయి.

◗ **నెలకు రూ.28.96 లక్షల ఖర్చు...:** జీజీహెచ్‌లో పారిశుద్ధ్యం పనులను హైదరాబాద్‌కు చెందిన ఒక ఏజెన్సీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం 103 మందితో పనులు చేయించాలి. అందుకు విరుద్ధంగా కేవలం 50 నుంచి 60 మంది మాత్రమే పనిలో ఉంటున్నట్లు సమాచారం. గదుల శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రం చేయాల్సి ఉండగా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.



పెద్దాసుపత్రికి నిర్లక్ష్యపు జబ్బు

ఒంగోలులోని సర్వజనాసుపత్రికి నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుందనేందుకు ఇదో నిదర్శనం. రోగులకు వినియోగించిన పాత ఇనుప మంచాలు, పరుపులు, నిరుపయోగంగా మారిన ఎలక్ట్రానిక్ వస్తువులన్నింటినీ ఆసుపత్రి భవనం.. అత్యవసర విభాగం మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశంలో పెద్ద గుట్టగా ఉంచారు. ఇవి ఎండకు ఎండి.. వానకు తడిసి దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా అత్యవసరంగా తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.- ఈనాడు, ఒంగోలు



ఆరుబయటే ఆసుపత్రి వ్యర్థాలు

విహారీ.. నవలోకం చూద్దాం రావోయ్..

జిల్లా ప్రకృతి అందాలకు చిరునామా. పశ్చిమంలో పచ్చదనంతో నిండిన నల్లమల..ఆహ్లాదం పంచే కంభం తటాకం..రాజసానికి ప్రతీకగా కనిగిరి దుర్గం సందర్శకుల్ని ఆకట్టుకుంటాయి. తూర్పున కడలి తీరం.. గుండ్లకమ్మ, రామతీర్థం జలాశయాలు మైమరిపింపజేస్తాయి. కనపర్తిలో వేల సంవత్సరాల నాటి జైన, బౌద్ధ, శైవ సంస్కృతులు చరిత్ర పుటల్లోకి తీసుకెళతాయి. పర్యాటక దినోత్సవ వేళ భువిపై వెలసిన ఈ దివిని చూసొద్దాం రండి..

– న్యూస్‌టుడే కంభం, కనిగిరి, మద్దిపాడు, నాగులుప్పలపాడు



హొయలొలికించే నెమలిగుండ్ల




ఇటీవల కురిసిన వర్షాలకు ఉద్ధృతంగా దూకుతున్న నెమలిగుండ్ల జలపాతం

ప్రత్యేకతలు :
▸ నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం జిల్లాలో పురాతన క్షేత్రం.
▸ భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రతీతి.

చూడాల్సినవి :
▸రాచర్ల మండలం జెల్లివారిపల్లెల చెరువులోని ఆలయం వద్ద ఉరుకులు పెట్టే జలపాతం. ▸చుట్టూ పచ్చని కొండల మధ్య పక్షుల కిలకిలరావాలు.
▸కొండ కోనల్లోంచి పరవళ్లీనే గుండ్లకమ్మ నది.

చేయాల్సినవి ఇవీ : అటవీ శాఖ అనుమతులతో కాటేజీల నిర్మాణం. జలపాతం వద్ద మౌలిక వసతుల ఏర్పాటు

కనువిందు చేసే కంభం చెరువు



పచ్చదనం పరచుకున్న కంభం చెరువు కట్ట పరిసరాలు (పాత చిత్రం)

ప్రత్యేకత :
▸ ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద తటాకం ▸ శ్రీకృష్ణదేవ రాయలు కాలం నాటి నిర్మాణం.

చూడాల్సినవి :
▸ఆహ్లాదాన్ని పంచే భారీ తటాకం మధ్యలో చిన్న కొండలు
▸ ఒంపులు తిరుగుతూ వెళ్లే గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంపై సవ్వడి చేస్తూ వెళ్లే రైళ్లు.

చేయాల్సినవి ఇవీ : ▸బోటు షికారు, కేరళ తరహాలో కాటేజీల నిర్మాణంతో వసతి ▸చిన్నారుల కోసం పార్కు ▸కొండల నడుమ తీగల వంతెన.

ప్రకృతి.. ఆధ్యాత్మికతల కలబోత



మల్లవరం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం



గుండ్లకమ్మ జలాశయంలో బోటు షికారు

ప్రత్యేకతలు :
▸ఇటు ప్రకృతి..అటు ఆధ్యాత్మికత కలబోసిన అత్యంత సుందరమైన ప్రాంతం గుండ్లకమ్మ జలాశయం. ▸జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉండి, రవాణా సౌకర్యమున్న ప్రాంతం


చూడాల్సినవి : చుట్టూ కొండల నడుమ సాగర్ జలాలతో నిండిన జలాశయం ▸గట్టున ఉన్న మల్లవరం వేంకటేశ్వర స్వామి ఆలయం. ఉద్యానవనం,

చేయాల్సినవి ఇవీ : జలాశయంలో బోటింగ్. ఉద్యానవనంలో వసతుల మెరుగు, పచ్చదనం జోడింపు. కాటేజీలకు మరమ్మతులు

నిలువెత్తు రాజసం.. కనిగిరి దుర్గం



కనిగిరి దుర్గానికి వెళ్లే మెట్లు



తీపి గుర్తుగా కాటమరాజు కాలం నాటి కోట బురుజు

ప్రత్యేకతలు :
▸దక్షిణ భారతదేశంలోనే రాజసానికి ప్రతీక కనిగిరి కోట. ▸ విజయనగర సామ్రాజ్యాధీశులు, గజపతులు, యాదవ, నాయక, రెడ్డి రాజులు, బహమనీ సుల్తానులు, ఆంగ్లేయులు ఏలిన ప్రాంతం.

చూడాల్సినవి : ▸కనిగిరి పట్టణానికి ఆనుకుని 13 కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన నిర్మాణాలు ▸శత్రుదుర్భేద్యమైన గోడ, 8 ప్రవేశ ద్వారాలు, చారిత్రక బురుజులు ▸శ్రీకృష్ణ దేవరాయలు భార్య చెన్నమ్మక్క బావి ▸విజయమార్తాండేశ్వర దేవస్థానం, సింగరప్ప దేవాలయం.

చేయాల్సినవి ఇవీ : ▸బురుజులు, చారిత్రక నిర్మాణాలు, కోటకు సొబగులు ▸నిక్షిప్తమై ఉన్న వందల ఏళ్ల నాటి శాసనాలను వెలుగులోకి తేవడం. ▸ఏనుగులు, గుర్రపు శాలలు దర్వాజాల పునరుద్ధరణ ▸శిథిలావస్థకు చేరిన లోదుర్గం మెట్లకు దారి నిర్మాణం.

చరిత్ర పుటల్లోకి తీసుకెళ్లే కనపర్తి



కనపర్తిలోని పురావస్తు మ్యూజియం

ప్రత్యేకతలు :
▸క్రీస్తు పూర్వం పదివేల ఏళ్ల నాటి చారిత్రక ఆధారాలు
▸ ప్రాచీన శిలా సంపద, జైనులు, బౌద్ధులు, శైవుల జీవన విధానం తెలిపే శాసనాలు.

చూడాల్సినవి :
▸కనపర్తి మ్యూజియంలో సప్తమాత్రికలు, వారాహి, కౌమరిణి, ధారాలింగం, దిగంబరేశ్వరుడు, వివిధ ఆకృతుల్లో శివలింగాలు, నందులు ▸బ్రాహ్మీ, పాళి, ప్రాకృత, ప్రాచీన తమిళ, చోళ శాసనాలు
▸పురాతన కాలం నాటి మట్టిపాత్రలు, రాతి విగ్రహాలు.

చేయాల్సినవి ఇవీ : ▸శిథిలావస్థకు చేరిన మ్యూజియానికి కొత్త భవన నిర్మాణం. శిథిలమైన అమ్మనబ్రోలు - కనపర్తి రోడ్డుకు మరమ్మతులు ▸జైనులు మొదలు..విజయనగర రాజుల కాలం వరకూ ఉన్న శాసనాలపై జిల్లాకేంద్రం చుట్టుపక్కల విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రాచుర్యాన్ని కల్పించడం.

చంద్రన్న చెప్పారు.. వాహనం ఇచ్చారు



చంద్రబాబు చేసిన సాయం గురించి తెలుపుతున్న లబ్ధిదారుడు సురేష్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దివ్యాంగుడు సురేష్ తన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తనకు విద్యుత్తు వాహనం ఇవ్వాల్సిందిగా వేడుకోగా..స్పందించిన ఆయన తక్షణం బాధితుడికి వాహనం సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. కేవలం అయిదు రోజుల్లోనే రూ.95 వేలు విలువ చేసే వాహనాన్ని ఒంగోలులోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అందజేశారు. తన కష్టం తీరిందని, జీవితాంతం చంద్రబాబుకు రుణపడి ఉంటానని లబ్ధిదారుడు సురేష్ ఈ సందర్భంగా చెప్పి ఉద్వేగానికి గురయ్యారు.

ఇటలీ స్టోన్ ప్రదర్శనలో గెలాక్సీ వెలుగులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఇటలీ దేశం వెరోనాలో ఈ నెల 24 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ స్టోన్ ప్రదర్శనకు జిల్లా నుంచి పలువురు గ్రానైట్ యజమానులు తరలి వెళ్లారు. ఈ నెల 24 నుంచి 27వ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో లభించే గ్రానైట్, మార్బుల్, క్వార్ట్జ్ తదితర ఖనిజాలకు చెందిన ఉత్పత్తులు కొలువుదీరాయని సందర్శకులు చెప్పారు. గనుల్లో వినియోగించే అత్యంత ఆధునికమైన యంత్రాలు కొలువుదీరాయి. విదేశీ కొనుగోలు దారులు పెద్దఎత్తున హాజరయ్యారు. చీమకుర్తి ప్రాంతం నుంచి వాసవి, కృష్ణసాయి, ధనలక్ష్మీ గ్రానైట్స్ యజమానులు శిద్దా వెంకట బాలాజి, శిద్దా భరత్ కుమార్, చిన్నపురెడ్డి మస్తాన్ రెడ్డి, సూర్య గ్రానైట్స్ యజమాని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పలువురు కొనుగోలు దారులు దీనికి తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ఎక్సైజ్ శాఖ డీసీగా హేమంత్ బాధ్యతల స్వీకరణ



హేమంత్ నాగరాజు



విజయ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్‌గా విజయ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీరు ఇప్పటివరకూ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరోలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పనిచేస్తూ వెయిటింగ్‌లో ఉన్నారు. సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసిన తరువాత వీరు తిరిగి మాతృశాఖలోకి వెళ్లారు. వీరిని ప్రకాశం, బాపట్ల జిల్లాల డిప్యూటీ కమిషనర్‌గా, అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. ఒంగోలులోని కార్యాలయంలో వీరు బాధ్యతలు స్వీకరించగా అధికారులు, సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కురవ అడవిలో పెద్దపులి



ఎద్దు కళేబరం వద్ద అటవీ శాఖ అధికారులు

అర్ధవీడు, న్యూస్‌టుడే: పెద్దపులి దాడిలో ఎద్దు మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. అర్ధవీడు మండలం బొల్లుపల్లి పంచాయతీ అచ్చంపేట గ్రామానికి చెందిన అంకయ్య తన ఎద్దులను మేత కోసం వెలగలపాయ కురవ ప్రాంతానికి రెండు రోజుల క్రితం తోలారు. ఒక ఎద్దు అదే రోజు సాయంత్రానికి ఇంటికి రాగా.. మరొకటి రాలేదు. తప్పిపోయిన ఎద్దు కోసం రెండు రోజులుగా గాలిస్తుండగా.. కురవ సమీప అడవిలో కళేబరం కనిపించింది. విషయాన్ని తురిమెళ్ల అటవీ శాఖ అధికారులకు తెలపడంతో బొల్లుపల్లి బీట్ అధికారి మంగేనాయక్, అర్ధవీడు పశువైద్యాధికారి శ్రీధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎద్దు కళేబరానికి పంచనామా చేసి పెద్దపులి దాడిలో మృత్యువాత పడినట్లు ధ్రువీకరించారు.

ప్రభుత్వ లాంఛనాలతో మాజీ ఎంపీ పార్వతమ్మ అంత్యక్రియలు

❖ రాష్ట్ర ప్రభుత్వం తరఫున నివాళులర్పించిన మంత్రి గొట్టిపాటి



నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, చిత్రంలో మాగుంట, కందుల, బీఎన్ తదితరులు

ఈనాడు, నెల్లూరు: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ అంత్యక్రియలు గురువారం నెల్లూరులో ప్రభుత్వ లాంఛనాలతో ముగిశాయి. అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఆమె చనిపోయిన విషయం తెలిసిందే. బుధ, గురువారాల్లో మాగుంట అభిమానులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వారి స్వగృహంలో ఉంచారు. పార్వతమ్మ మరిది ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట కుటుంబసభ్యులను రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. ఆమె చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై నివాళులర్పించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల రాజకీయాల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రజలతో మాగుంట కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందని గొట్టిపాటి కొనియాడారు. మధ్యాహ్నం ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత పార్వతమ్మ పార్థివదేహానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించి.. పోలీసు బ్యాండ్‌తో నివాళులర్పించారు. అంతిమయాత్రలో ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు. శ్మశానవాటికలో పోలీసులు గౌరవ వందనం చేశారు. ఆమెకు నివాళిగా గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆమె మనవడు మాగుంట సుబ్బరామిరెడ్డి చేతుల మీదుగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. గురువారం నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కరణం బలరాం, కంభంపాటి విజయరామిరెడ్డి, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జల వనరుల శాఖలో బదిలీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా జల వనరుల శాఖలో ముఖ్య అధికారుల బదిలీలు జరిగాయి. లింగంగుంట సర్కిల్‌లో పనిచేస్తున్న డి.వరలక్ష్మిని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా నియమించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు డివిజన్-1లో పనిచేస్తున్న పొట్లూరి చినబాబును చింతలపూడి ఎల్ఐ స్కీము ఈఈగా బదిలీ చేశారు. మార్కాపురంలో వెలిగొండ ప్రాజెక్టులో పనిచేస్తున్న పి.పురార్దన్‌రెడ్డిని అక్కడే మైనర్ ఇరిగేషన్ ఈఈగా బదిలీ చేశారు. మార్కాపురం స్పెషల్ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న అబుద్‌అలీని అక్కడే వెలిగొండ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. జీఆర్‌పీ డివిజన్‌లో పనిచేస్తున్న మురళిని అద్దంకి ఎన్ఎస్‌పీ ఈఈగా బదిలీ చేశారు.

నాడు చెత్తకుప్పల వెంట.. నేడు ఆత్మీయుల చెంత

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్ల వెంట సంచరించిన మతిస్థిమితంలేని వ్యక్తి ఎట్టకేలకు ఆత్మీయుల చెంతకు చేరాడు. కొమరోలు మండలం వట్టిదేపమానిపల్లె గ్రామానికి చెందిన జెర్రిపోతుల నాగేశ్వరరావు.. పాల వ్యాపారం చేస్తూ ఉన్నతంగా బతికేవారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు వదిలి మతిస్థిమితం కోల్పోయి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి చేరుకున్నారు. దీంతో స్థానికులు ఖమ్మంలోని అన్నం సేవా ఆశ్రమానికి సమాచారం అందించారు. చికిత్స ద్వారా మామూలు మనిషిగా చేయగలిగారు. పేరు, వివరాలు కనుక్కుని అక్కడి పోలీసులకు సమాచారమందించి కుటుంబ సభ్యులను రప్పించారు. నేలకొండపల్లి ప్రధాన కూడలిలో ఏఎస్ఐ కోడెత్రాచు, రెవెన్యూ అధికారుల సమక్షంలో అన్నం శ్రీనివాసరావు, నాగేశ్వరరావును అతని కుటుంబీకులకు అప్పగించారు. అన్నంను స్థానికులు అభినందించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన నిందితుడి పట్టివేత

పొదిలి, న్యూస్‌టుడే: మూగచింతలలో దివ్యాంగ యువతిపై అత్యాచారం చేసిన కేసులో బట్టువారిపల్లికి చెందిన వేల్పుల రహేలయ్యను అరెస్టు చేసినట్లు పొదిలి ఎస్సై వేమన తెలిపారు. బాధితురాలి అక్క ఈ నెల 22న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ సూచనలతో డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ఈనెల 19న సాయంత్రం మేకలను మేపుకోవడానికి వెళ్లిన యువతిని బట్టువారిపల్లికి చెందిన వేల్పుల రహేలయ్య సజ్జ పొలంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు చెప్పారు. విషయం బయటకు రావడంతో బాధితురాలిని ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పి చికిత్స అందించామన్నారు. నిందితుడిని గురువారం పొదిలిలో అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి పొదిలి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు. కేసును సత్వరం ఛేదించిన సందర్భంగా ఎస్పీ దామోదర్.. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, సిబ్బంది పూర్ణ, శ్రీనివాసులు, తిరుపతినాయక్‌లను అభినందించారు.

ఆడిట్ అధికారిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

ఒంగోలు నేరవిభాగం: జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్‌పై ఈ నెల 11న జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులను ఒంగోలు ఒకటో పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జిల్లాలోని సహకార పరపతి సంఘాల్లో జరిగిన అవినీతిపై ఆడిట్ అధికారి రాజశేఖర్ చేసిన తనిఖీలు చేసిన నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు పోలీసులు నిర్ధరించారు. ఒంగోలుకు చెందిన దాసరి శ్రీనివాస రాజు, శ్రీకాంత్, నిఖిల్, అజయ్, కార్తీక్, సుబ్బారావు ఈ దాడికి పాల్పడినట్లు గుర్తించారు. సహకార సంఘాల్లో రాజశేఖర్ తనిఖీల అనంతరం వారు ఆయన వ్యక్తిగత వ్యవహార శైలిపై నిఘా పెట్టి కొన్ని వివరాలు సేకరించారని, ఈ విషయం తెలిసి ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు పీఏసీఎస్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. దీంతో నిందితులు ఆడిట్ అధికారి రాజశేఖర్‌పై దాడి చేసినట్లు తమ విచారణలో తేలిందని ఒంగోలు ఒకటో పట్టణ సీఐ నాగరాజు చెప్పారు. వారిని అరెస్టు చేసి వారికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

కొత్తపట్నం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపట్నం మండలంలోని పాదుర్తిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు(58) కుటుంబ సభ్యులు మాట వినకపోవడంతో మనస్థాపానికి గురై బుధవారం రాత్రి పురుగుల మందు తాగారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలులోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

జరుగుమల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన అడ్డరోడ్డు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సింగరాయకొండకు చెందిన బక్కమంతుల శ్రీనివాసులు(48), టంగుటూరుకు చెందిన షేక్ అల్లాబాషా ద్విచక్ర వాహనంపై జరుగుమల్లి మండలం వావిలేటిపాడుకు వ్యక్తిగత పనులపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో టంగుటూరు వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని 108లో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో కత్తితో హల్‌చల్...

కొమరోలు గ్రామీణం: మద్యం మత్తులో ఓ వ్యక్తి గ్రామ నడ్డిబొడ్డులో కత్తి పట్టుకొని హల్‌చల్ చేసిన సంఘటన రాజుపాలెంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుడు నేరెళ్ల శేఖర్ మద్యం తాగి కత్తితో కుటుంబ సభ్యుల్ని బెదిరించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతను హల్‌చల్ చేస్తుండడాన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దానిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

కంభం : కంభం పట్టణానికి చెందిన బాలికను సురేష్ అనే యువకుడు ఆగస్టులో మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. దీనిపై ఆమె తండ్రి ఈ నెల 3న ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గురువారం కడులాపురం కూడలిలో అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

ఇసుక చోరీపై కేసు...

పెద్దారవీడు, న్యూస్‌టుడే: మండల కేంద్రం పెద్దారవీడులోని స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిల్వ ఉంచిన ఇసుక చోరీకి గురైనట్లు గుర్తించిన హౌసింగ్ ఏఈ శ్రావ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ గురువారం తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం



విద్యుత్తు ఉపకేంద్రం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి, న్యూస్‌టుడే: ప్రజలు ఏ నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారో.. అదే నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం చీమకుర్తి మండలం రామతీర్థం వద్ద రూ.3.50 కోట్లతో నిర్మించిన విద్యుత్తు ఉపకేంద్రాన్ని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆర్ఎల్‌పురంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. మెరుగైన విద్యుత్తు సరఫరా చేసే విధంగా త్వరలో మరిన్ని ఉపకేంద్రాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గుండ్లకమ్మ కాలువల మరమ్మతుల విషయాన్ని నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. త్వరలోనే దీపం పథకం ద్వారా మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. విద్యుత్తు ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ కరీమ్, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారిణి జ్యోతిరాణి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, బాపట్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాదరావు, మండల, పట్టణ తెదేపా అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, అగ్గిరామయ్య, పమిడి రవితేజ, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు అక్టోబర్ మూడులోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డి.సుభద్ర తెలిపారు. పరీక్ష డిసెంబర్ ఎనిమిదో తేదీన జరుగుతుందన్నారు. హెచ్ఎంలు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ కోర్సులు టైలరింగ్, డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ పరీక్ష ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కుల జాబితాను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

29న పాఠశాల క్రీడా పోటీల ఎంపికలు

ఒంగోలు నగరం: జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని అండర్ 17 బాలబాలికల పాఠశాల క్రీడా పోటీలు ఈ నెల 29న జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వనజ పేర్కొన్నారు. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు స్థానిక శర్మ కళాశాల వద్దనున్న వ్యాయామ కళాశాలలో, షూటింగ్ పోటీలు కొత్తపట్నం రోడ్డులోని నెక్స్‌జెన్ స్కూలులో, విలువిద్య పోటీలు చర్చి సెంటర్‌లోని సమావేశం స్కూలులో, ఫెన్సింగ్ పోటీలు గద్దలగుంటలోని ఓరియంటల్ స్కూలులో జరుగుతాయన్నారు. ఉమ్మడి ప్రకాశం పరిధిలోని విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందాలన్నారు. 17 సంవత్సరాల విభాగంలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు టెన్త్ మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి, చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపల్ ధ్రువీకరణతో హాజరుకావాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

అర్థవీడు, న్యూస్‌టుడే:

సమస్య: అయ్యవారిపల్లి బస్టాండ్ సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన త్రీఫేజ్ బోరు లీకేజీలతో తరచూ నీరు వృథా అవుతుంది. తాగునీటికి వాడుక నీటికి ఇబ్బందులు పడుతున్నాం. – పుల్లయ్య, స్థానికుడు.
సమాధానం: సిబ్బందిని పంపి బోరుకు మరమ్మతులు చేపడతాం.
– జగదీష్, ఎంపీడీవో, అర్థవీడు.

సమస్య: నాగులవరం ఎస్సీ కాలనీ సమీపంలోని సింగిల్ ఫేజ్ విద్యుత్తు పరివర్తకం వద్ద ఎర్త్ తీగ కాలిపోతూ..తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.
– ఎస్సీ కాలనీవాసులు
సమాధానం: పరిశీలించి ఎర్త్ సమస్యను వెంటనే బాగు చేస్తాం. – గోపి, లైన్‌మెన్, నాగులవరం.

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

పొదిలి : రాష్ట్రంలో హమాలీల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. గురువారం పొదిలి సివిల్ సప్లై గోదాము వద్ద హమాలీల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. హమాలీల సమస్యలపై ప్రభుత్వం చర్చించి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

పొదిలి, కంభం(రాచర్ల): పొదిలి మండలంలోని కంభాలపాడులో గురువారం ఆత్మ డీపీఎం సుబ్రమణేశ్వరరావు, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామ్మోహనరావు, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ జి.రమేష్ వరి, కంది, పొగాకు పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ● రాచర్ల మండల పరిషత్తు కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు ఎంపీడీవో వెంకటరమిరెడ్డి అవగాహన కల్పించారు.

వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించండి

మార్కాపురం, న్యూస్‌టుడే: నాణ్యమైన మెనూ పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలని మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కిషోర్‌కుమర్ ఆదేశించారు. గురువారం మార్కాపురంలోని లక్ష్మీచెన్నకేశవనగర్‌లోని ఎస్సీ కళాశాల ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. సరకు నిల్వ గదితో పాటు వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు ట్రోల్‌ఫ్రీ నెంబరు 15100కి ఫోన్ చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయించారు. ● కంభం: మండలంలోని రావిపాడు జడ్పీ ఉన్నత, సత్యనారాయణ ఎయిడెడ్ పాఠశాలలను గురువారం ఎంఈవోలు మాల్యాద్రి, శార్వాణి తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.


వసతిగృహంలో సరుకులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి కిశోర్‌కుమార్

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

మార్కాపురం, న్యూస్‌టుడే : తెలంగాణలో దొరల పాలన అంతం కోసం భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని తెలుగు రాష్ట్రాల రజక విద్యా సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవ లాటి శంకర్, తెదేపా రాష్ట్ర నాయకుడు, మాజీ రాష్ట్ర వాషర్‌మెన్ కార్పొరేషన్ ఫెడరేషన్ డైరెక్టర్ కనిగిరి బాల వెంకట రమణ పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె చిత్రపటం వద్ద రజక విద్యా సేవా సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు.


ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న శంకర్, రమణ, ప్రజా సంఘాల నాయకులు

స్వచ్ఛత... ఆచరణలో ఏదీ?

స్వచ్ఛ భారత్ అంటూ దేశ ప్రధాని మొదలు..గ్రామ స్థాయి వరకు వివిధ కార్యక్రమాలు, సభలు, సదస్సులు నిర్వహిస్తూ ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నారు. కొమరోలు మండల పరిషత్తు అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశుభ్రంపై అవగాహన కల్పిస్తున్నారు. కాని తమ సొంత కార్యాలయంలోని అపరిశుభ్రతను మరిచారు. ప్రస్తుతం స్వచ్ఛతా హీ సేవ పేరుతో కార్యక్రమాలు చేపట్టే అధికారులకు తమ కార్యాలయ పరిశుభ్రతను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. నిత్యం పనులు కోసం కొమరోలు మండల పరిషత్తు కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్ అంటూ ఉదరగొట్టే అధికారులు, ప్రజాప్రతినిధులకు మండల కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలన్న విషయం పట్టదా అని ప్రశ్నిస్తున్నారు.
– న్యూస్‌టుడే కొమరోలు గ్రామీణం


మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో పెరిగిన చెట్లు

పేరుకే.. ఆదర్శ రైల్వేస్టేషన్

❑ మెరుగుపడని సౌకర్యాలు ❑ ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


సరిపడా బల్లలు, కుర్చీలు లేక కింద కూర్చున్న ప్రయాణికులు

మార్కాపురం, న్యూస్‌టుడే:

మార్కాపురం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సరిపడే సౌకర్యాలు కల్పన లేక ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ రైల్వేస్టేషన్ నుంచి ఎన్ఎస్‌జీ-3గా, ఆ తరువాత ఎన్ఎస్‌జీ- 4 గ్రేడ్‌కు మారినా కూడా సౌకర్యాలు కల్పించడంలో వివక్షకు గురికావడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం రైల్వేస్టేషన్‌ను ఆదర్శ రైల్వేస్టేషన్‌గా మార్పు చేసి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా అందుకు తగినట్లుగా సౌకర్యాలు కల్పన లేక వాపోతున్నారు.

తాగునీటి సమస్య

స్టేషన్‌లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సీసాలు కొనుగోలు చేసుకొని తాగాల్సిందే. దాత మాజీ ఎంపి, వై.వి.సుబ్బారెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రం మూతపడి ఉంది. స్టేషన్‌లో ఉన్న అన్ని తాగునీటి కుళాయిల్లో కేవలం మూడింటికి మాత్రమే నీటి సరఫరా వస్తుంది. మిగిలిన వారికి రావడం లేదు. కొన్ని చోట్ల కుళాయిలకు బిరడలేవు.

మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్ల టెండరు దక్కించుకున్న వారు డ్రమ్ములతో నీటిని తెచ్చిపెడుతున్నా సరిపోవడం లేదు.

అసంపూర్తి పనులు

ప్లాట్‌ఫాం నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. రెండు ప్లాట్‌ఫాంలపై ప్రయాణికులు అధిక సంఖ్యలో వచ్చినప్పుడు కూర్చోవడానికి కూడా సరిపడా బల్లలు, కుర్చీలు అందుబాటులో లేవు. స్టేషన్ ఆవరణలో చేపట్టిన అతిథి గృహాలు నిర్మాణం అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయాయి. ఫ్యాన్లు సరిపడా లేవు. ప్రయాణికులు రాకపోకలు సాగించేటప్పుడు రైలు వచ్చిన ప్లాట్‌ఫారంపై నిలబడి ఉన్న సమయంలో బోగీలు కనిపించడానికి కోచ్ ఇండికేటర్లు లేవు. దీంతో రిజర్వేషన్ బోగీలు ఎక్కడా ఆగుతాయనే విషయం ప్రయాణికులకు తెలియడం లేదు. రైళ్ల రాకపోకలకు సంబంధించి ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేయాల్సిన డిజిటల్ నేమ్ బోర్డులు అందుబాటులో లేవు. మూడు ఏళ్ల కిందట ప్రారంభించిన పార్కు నేడు నిర్వహణ లేక అడవిని తలపిస్తుంది.


మూతపడిన శుద్ధజల కేంద్రం

● రైల్వేస్టేషన్ నుంచి నెలకు రిజర్వేషన్ చేసుకొని ప్రయాణిస్తున్న వారు 1,57,555 మంది. సాధారణ ప్రయాణికులు 5,23,490

సిబ్బంది కొరతతో.. సతమతం

ఈ స్టేషన్‌లో ప్రభుత్వ రైల్వే పోలీసులు ఇద్దరూ ఉంటున్నారు. పగలు ఇద్దరూ, రాత్రి ఇద్దరూ మాత్రమే ఉంటున్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు కూడా ఇద్దరూ మాత్రమే పని చేస్తున్నారు. వందల మంది ప్రయాణికులు రోజు రాకపోకలు సాగిస్తుంటే కేవలం నలుగురు పోలీసు సిబ్బంది సెక్యూరిటీ కల్పించలేకపోతున్నారు. జీఆర్‌పీ పోలీసులకు ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడే సరిపోతుంది. ఆ తర్వాత స్టేషన్‌లో ఒక్క కానిస్టేబుల్ కూడా విధుల్లో ఉండలేక పోతున్నారు.


తాగునీరు సరఫరా కాక నిరుపయోగంగా ఉన్న కుళాయిలు

పేరుకు పోయిన వ్యర్థాల తొలగింపు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు నగర పంచాయతీలోని నల్లబండ ప్రాంతం నుంచి రాచర్ల గేటు మీదుగా వెళుతున్న సగిలేరు సప్లయి ఛానల్‌లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించేందుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నల్లబండ ప్రాంతం మీదుగా వెళుతున్న సగిలేరు సప్లయి చానల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పూడిక తొలగించక పోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో సమీప నివాస ప్రాంతాల వారు రాత్రివేళ దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు వ్యాధుల భారిన పడుతున్నారు. గత పాలకులు స్థానికుల గోడును పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఈ సమస్యపై దృష్టి పెట్టారు. గురువారం ఉదయం యంత్రంతో రాచర్ల గేటు ప్రాంతంలోని సగిలేరు సప్లయి చానల్‌లోని పేరుకున్న వ్యర్థాలను, కంపచెట్లను తొలగించే పనులు చేపట్టారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సప్లయి చానల్‌కు ఇనుప గ్రిల్ ఏర్పాటు చేసి అందుల్లో గృహాల్లోని వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


యంత్రంతో పూడిక తొలగించిన తరవాత రాచర్ల గేటులోని సగిలేరు సప్లయిచానల్ ఇలా...

పౌష్టికాహారం.. ఆరోగ్యానికి అవసరం

మార్కాపురం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీపీడీవో సుశీలాదేవి పేర్కొన్నారు. మండలంలోని రాయవరం గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు లలితసలోమి, ప్రిన్సిపల్ జి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● పెద్దదోర్నాల: నల్లగుంట్లబోడు గూడెంలో సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. సీడీపీవో పద్మావతి మాట్లాడుతూ... పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న గిరిజన మహిళలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అకుకూరలు, కూరగాయలు, పండ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ సంస్థ కమ్యూనిటీ మొబలైజర్ కె.బాలరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


పెద్దదోర్నాల: గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీవో పద్మావతి

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం మండలం నల్లమల అడవిలోని పాలుట్ల దాని చుట్టుపక్కల గిరిజన గూడేలకు రహదారి సౌకర్యం కల్పించాలని వై.పాలేనికి చెందిన తెదేపా రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జుననాయుడు సీఎం చంద్రబాబును కోరారు. బుధవారం రాత్రి సీఎంవో కార్యాలయంలో సీఎంను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించడంపై సీఎంకు ఆయన దన్యవాదాలు తెలిపినట్లు తెలిపారు.


సీఎం చంద్రబాబును కలిసిన మల్లికార్జుననాయుడు

నిధులు కేటాయించండి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెంలో వడ్డెర కమ్యునిటీ హాలుకు నిధులు మంజూరు చేయాలని, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని నియోజకవర్గంలోని పుల్లలచెరువుకు చెందిన వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాము ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. రాజధాని పరిధిలో వడ్డే ఓబన్న విగ్రహానికి స్థలం కేటాయించాలని, వడ్డెర్ల అభివృద్ధికి తగిన ప్రాధ్యాన్యత కల్పించాలని కోరినట్లు తెలిపారు.


మంత్రి లోకేష్‌ను కలిసిన వేముల రాము

వరద బాధితులకు సాయం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తెదేపా నాయకులు గురువారం రూ.82,000 చెక్కును, రూ.22,000ల నగదును తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు అందజేశారు. ఎరిక్షన్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కును, నగదును అందజేశారు.


ఎరిక్షన్‌బాబుకు చెక్కును అందజేస్తున్న తెదేపా నాయకులు


మార్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి


గిద్దలూరు: ముండ్లపాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

మార్కాపురం పట్టణం, గిద్దలూరు పట్టణం, పొదిలి : తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 31వ వార్డులో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి ప్రజలను అందుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్. నారాయణరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● గత వైకాపా ప్రభుత్వం మూసివేసిన అన్న క్యాంటిన్లను కూటమి ప్రభుతం తెరిచి పేదల కడుపు నింపుతున్నామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో నిర్వహించి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ● పొదిలి 8వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయం ఉద్యోగులు, తెదేపా నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అంటించారు 2వ సచివాలయం పరిధిలో ర్యాలీ నిర్వహించారు.

ఎట్టకేలకు కందిపప్పు సరఫరా

ఈనాడు కథనానికి స్పందన

బేస్తవారపేట, న్యూస్‌టుడే : బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం కందిపప్పును అందజేశారు. మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్యకర్తలే సొంత డబ్బుతో కందిపప్పును బయట మార్కెట్లో కొనుగోలు చేసి వండి పెడుతున్న వైనంపై బుధవారం 'ఈనాడు'లో 'పోషకాహారం పప్పు లోపం ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలోఫర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు గురువారం బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పును సరఫరా చేయించారు.

కనిగిరిలో నేటి నుంచి శిక్షణా తరగతులు

త్రిపురాంతకం గ్రామీణం: కనిగిరిలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న సీపీఐ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాస్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో గురువారం సమావేశం జరిగింది. శిక్షణా తరగతులకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూర్ బాషా సంఘం ఏర్పాటు చేసి అందుకు రూ.100కోట్ల నిధులు ఏర్పాటు చేస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర నూర్ బాషా సంఘం ఉపాధ్యక్షులు డి.మస్తానయ్య సంతోషం వ్యక్తం చేశారు.

చినగానిపల్లి వాసికి మదర్‌థెరిసా సేవారత్న పురస్కారం

కంభం (రాచర్ల): పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలకు గాను రాచర్ల మండలం చిన్నగానిపల్లికి చెందిన చిన్ని ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్‌కు మదర్‌థెరిసా సేవారత్న అవార్డు వచ్చింది. గుంటూరుకు చెందిన అమ్మవాడి చారిటబుల్ ట్రస్టు వారు ఈ అవార్డును ప్రకటించినట్లు శ్రీకాంత్ తెలిపారు.

మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

అర్థవీడు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని మార్గదర్శి జిల్లా పర్యవేక్షకులు రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకులాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు.

వృత్తి విద్యపై అవగాహన: మార్కాపురం, న్యూస్‌టుడే: రాయవరం గ్రామంలోని కస్తూర్బిగాంధీ బాలికా విద్యాలయంలో టైలరింగ్‌పై విద్యార్థులకు ఎల్.ఎన్.జె సంస్థ అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సంస్థ హెడ్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు వృత్తి విద్య కోర్స్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా బాధ్యతల స్వీకరణ



పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమలాపురంలో ఈఈగా పనిచేస్తూ బదిలీపై పొదిలి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఈ కె.మురళీధర్‌రావు అనంతపురానికి బదిలీపై వెళ్లారు.

వర్షమొస్తే రాకపోకలు బంద్

● అభివృద్ధికి నోచుకోని చప్టాలు.. ● వంతెన నిర్మాణాలు ప్రతిపాదనలతో సరి


ఎగువ చెర్లోపల్లె వద్ద ప్రవహిస్తున్న తీగలేరు వాగు (ఫైల్ ఫొటో)

పెద్దదోర్నాల, పొదిలి, న్యూస్‌టుడే:

నల్లమల అటవీ ప్రాంతంలో వర్షం కురిసిందంటే చాలు దోర్నాల మండలంలోని ఎగువ చెర్లోపల్లె, గంటవానిపల్లె, చిన్నదోర్నాల గ్రామస్థుల గుండెల్లో భయాందోళన మొదలవుతుంది. తీగలేరు వాగు పొంగి వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. ఆ వాగుపై చిన్నపాటి చప్టాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

ముఖ్యమంత్రులు హామీలిచ్చినా...


గంటవానిపల్లె, ఎగువ చెర్లోపల్లె పంచాయతీల పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల నిర్మాణాలు జరిగాయి. 2008లో తొలి సొరంగం నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గంటవానిపల్లె వద్ద ఉన్న తీగలేరు వాగుపై వంతెన నిర్మిస్తానని బహిరంగ సభలో హామీ ఇచ్చారు. అలాగే సొరంగాల నిర్మాణాల పనులు పరిశీలించేందుకు 2018లో వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎగువ చెర్లోపల్లె వద్ద ఉన్న తీగలేరు వాగుపై వంతెన నిర్మాణం చేపడతామని బహిరంగం సభలో హామీ ఇచ్చారు. వారి హామీలు నేటికి కార్యరూపం దాల్చలేదు.

ప్రజల సమస్య తీర్చండి...

ఇటీవల కురిసిన వర్షాలకు ఆ వాగులో ఉద్ధృతంగా వరద నీరు ప్రవహించడంతో మూడు రోజుల పాటు బాహ్య ప్రపంచానికి వచ్చేందుకు వీలులేక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నదోర్నాల వద్ద ఉన్న తీగలేరు వాగు ఒంగోలు-శ్రీశైలం రహదారిలో ఉంది. వరద నీరు ప్రవహించేటప్పుడు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 11న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా దోర్నాల మండలంలో పర్యటించారు. ఆ సందర్భంగా ఆమె చిన్నదోర్నాల వద్ద ఉన్న తీగలేరు వాగును పరిశీలించారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదన పంపుతామన్నారు. ప్రభుత్వం స్పందించి తీగలేరు వాగు ప్రవహిస్తున్న మూడు ప్రదేశాల్లో తీగలేరు వాగుపై వంతెనలు నిర్మించి తమ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. వాటిపై వంతెనల నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపామని ఎంపీడీవో నాసర్‌రెడ్డి తెలిపారు.

ప్రధాన రహదారుల్లో అవస్థలు

● పొదిలి నుంచి పశ్చిమప్రాంతానికి అనుసంధానంగా ఉండే రహదారుల్లో వర్షాకాలమొస్తే వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా పొదిలి-మార్కాపురం మార్గంలోని బట్టువారిపల్లి వాగు ప్రమాదకరంగా మారింది. మూగచింతల, సిద్ధవరం పై ప్రాంతంలో ఓ మోస్తారు వర్షం పడిన ఈ వాగు పొంగుతుంది. దీంతో ఈ వాగుపై ఉన్న చప్టాపై నుంచి నీటి ఉద్ధృతి పెరుగుతుండటంతో వాహన రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. నాలుగేళ్ల క్రితం ఈ వాగులో ఓ ఆటో, ద్విచక్రవాహనం కొట్టుకు పోయింది. అదృష్టవశాత్తు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పొదిలి-దర్శి మార్గంలోని మల్లవరం వద్ద చప్టా కూడా ప్రమాదకరంగా మారింది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షం పడితే చప్టా పై నుంచి నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. పొదిలి మండలంలోని సూదనగుంట- తుమ్మగుంట గ్రామాల మధ్య ఉన్న చప్టాపై ఇదే పరిస్థితి. దశాబ్దాలుగా ఆయా మార్గాల్లో చప్టాలపై వంతెనలు నిర్మించాలని ప్రభుత్వాలను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు కాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వమైన చొరవ తీసుకొని వర్షాకాలంలో ప్రమాదకరంగా ఉన్న చప్టాలపై వంతెనలు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


పొదిలి–మార్కాపురంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బట్టువారిపల్లివాగు

అక్రమంగా నిల్వఉంచిన ఎరువుల పట్టివేత

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు మండలం దేవనగరం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 19,205 మెట్రిక్ టన్నుల ఎరువులను గురువారం గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. ఆయా ఎరువుల విలువ రూ. 3,77,208. అక్రమంగా నిల్వలు చేసిన వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.భాస్కర్‌రెడ్డి, సాంకేతిక వ్యవసాయశాఖ అధికారి ఎస్.కె.మహబూబ్ బాషా, వీఆర్వో సయ్యద్ చిన్నకాశిం పాల్గొన్నారు

కురిచేడు, న్యూస్‌టుడే

సమస్య : పడమర వీరాయపాలెం పంచాయతీలోని వెంగాయపాలెం, బీసీ కాలనీలో నెల క్రితం పాత విద్యుత్తు స్తంభాలను, తీగలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. మరమ్మతుల సమయంలో తొలగించిన వీధి దీపాలను ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు.

– వెంకటేశ్వర్లు, వెంగాయపాలెం

సమాధానం: రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: తిమ్మారెడ్డిపల్లి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలతోపాటు, హెచ్‌ఎంపాడులోనూ విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. పలుమార్లు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

–ఎస్.వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం : కొత్త విద్యుత్తు లైన్ ఏర్పాటు చేస్తున్నందున అంతరాయం జరుగుతుంది. జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉంది. వెంటనే సమస్య పరిష్కరిస్తాం.

–మణికంఠ, విద్యుత్తు ఏఈ

కనిగిరి, న్యూస్‌టుడే:

సమస్య: కనిగిరి పట్టణంలోని బీసీ కాలనీ, వేంకటేశ్వర దేవస్థానం ప్రాంతాల్లో రాత్రి పూట వీధిలైట్లు వెలగడం లేదు. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కుక్కల బెడద అధికంగా ఉండడంతో వెళ్లాలంటే భయపడాల్సి వస్తుంది. – రమణయ్య, బీసీ కాలనీ వాసి

సమాధానం: పూట వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– డానియేల్ జోసెఫ్, మున్సిపల్ కమిషనర్, కనిగిరి

సమస్య: కనిగిరి పట్టణంలోని కొట్ల బజారులో విద్యుత్తు స్తంభాలు పాతవి కావడంతో సిమెంటు రాలిపోయి ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు షాక్ కొడుతున్నాయి. వెంటనే స్తంభాలు మార్చాలి.

– డి.మధుసూదన్, స్థానికుడు

సమాధానం: కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూస్తాం.

– పవన్‌కుమార్, విద్యుత్తు ఏఈ

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

హనుమంతునిపాడు: పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. హెచ్‌ఎంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉపాధి హామీ సిబ్బందితో కలిసి గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై సమీక్ష

హనుమంతునిపాడు: పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కృష్ణారావు ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పక్కాగృహాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, తాగునీరు, విద్యుత్తు తదితర అంశాలపై చర్చించారు.

మన ఆహారం.. ఆరోగ్యం

• రక్త హీనత నివారణకు తరుణోపాయం
• ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వంటకాలపై అవగాహన

న్యూస్‌టుడే, కనిగిరి, దర్శి

ఎంతో మంది చిన్నారులు, గర్భిణులు పోషకాహార లోపంతో రక్తహీనత కలిగి అనారోగ్యం పాలవుతున్నారు. ఇలాంటి వారికి అవగాహన కల్పించి అందుబాటులో ఉన్న పదార్థాలతోనే వంటకాలు చేసుకొని తినడం వల్ల కలిగే లాభాలను ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది వివరిస్తున్నారు. ప్రస్తుతం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కనిగిరి, కొండపి, దర్శి నియోజకవర్గాల్లో నిత్యం అవగాహన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. గురువారం కనిగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, దర్శి కృషి విజ్ఞాన కేంద్రంతోపాటు, వివిధ మండలాల్లో వంటకాలను ప్రదర్శించారు. కనిగిరిలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, ఆర్డీవో పి.జాన్‌ఇర్విన్, మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సీడీపీవో సరోజని, దర్శిలో ఎంపీపీ సుధారాణి, శాస్త్రవేత్త మానస, సీడీపీవో భారతి ఐటీసీ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరావు, విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అందరికీ లభించే సజ్జలు, రాగులు, జొన్నలు, అరికెలు, కొర్రలు, ఉలవలు, అలసంద, బఠాని, పెసలు, పచ్చి శనగలు తదితర వాటితో వివిధ రకాల వంటకాలు ఎలా తయారు చేయవచ్చునో అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా చేసి ప్రదర్శించారు. వాటి గురించి మనమూ తెలుసుకుందాం.



కనిగిరి: పోషకాహార మాసోత్సవాలను సూచించే గుర్తు వద్ద కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు



కనిగిరిలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఇతర అధికారులు

సజ్జ బూరెలు.. మిక్కిలి విటమిన్లు



బయట బూరె ఒక్కొక్కటి కొనాలంటే రూ.10 అవుతుంది. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం, తక్కువ రేటుకు దొరికే సజ్జలు, రాగులు, జొన్నలతో అతి తక్కువతో ఖర్చుతో ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. వీటిని పిండిగా చేసి బెల్లం, లేకుంటే చక్కెరలో కలిపి కాస్త నూనెలో వేసి బూరెలు, బిస్కెట్లుగా తయారు చేసుకోవచ్చు. వీటిని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తినవచ్చు. వీటిలో ఐరన్, విటమిన్లు లభిస్తాయి. రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయి.

జొన్న, రాగి రొట్టెలతో..



గతంలో గ్రామీణ ప్రాంతాల్లో జొన్న, రాగి, సజ్జ రొట్టెలు తినేవారు. ప్రస్తుతం పట్టణాల్లోనే కాదు, పల్లెల్లోనూ వీటిని మర్చిపోయారు. బాలామృతంతో పాటు, సజ్జ, రాగి, జొన్న పిండిలో కాస్త, ఉప్పు, బెల్లం, వేసి పిండిని ముద్దగా కలిపి రొట్టెలా కాల్చి తింటే ఎంతో రుచిగా, బలవర్ధకంగానూ ఉంటుంది. మునగాకు, బచ్చలి, తోటకూర, చుక్క కూరా కూడా కలిపి రొట్టెలు చేసుకుని తింటే కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు పుష్కలంగా లభిస్తాయి.

లడ్డూ..పోషకాలు మెండు..



రాగి, నువ్వులతో లడ్డులూ తయారు చేసుకుని తినవచ్చు. వీటిలో కాస్త, చక్కెర నూనె, పిండిని కలిపితే మరింత రుచిగాను ఉంటాయని అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్నారు. వీటి వల్ల ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, విటమిన్లు లభించి చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత నివారించవచ్చు.

శనగలతో గుగ్గిళ్లు..



ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉన్నా పెసర, అలసంద, ఉలవలు, పచ్చి శనగ, బఠాణీలను చాలా మంది ఆహారంలో తీసుకోరు. అయితే వీటితో తినుబండారాలు చేస్తే పిల్లలు సైతం ఇష్టంగా తింటారు. ఉలవల్లో-సి, అలసందలో-సి, బీ6, పెసరలో-సి, ఇ విటమిన్లు ఉంటాయని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. నేరుగా తినకుండా ఉడక బెట్టుకుని తింటే ఎంతో రుచిగా ఉంటాయి. నానబెట్టుకుని మొలకలు వచ్చాక కూడా తినవచ్చని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శనలో వివరించారు.

వంద రోజుల్లోనే సంక్షేమ ఫలాలు



స్వర్ణాంధ్ర-2047 గోడప్రతులు ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి తదితరులు

దర్శి, న్యూస్‌టుడే: వంద రోజుల కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. స్థానిక క్రిస్టియన్‌పాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్, మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఇతర అధికారులు, నాయకులతో కలిసి గురువారం ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. వైకాపా ఐదేళ్ల పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, చివరకు ఆలయాలను కూడా అపవిత్రం చేశారని మండిపడ్డారు. తొలుత మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను అధికారులు ప్రారంభించారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య, తహసీల్దార్ శ్రావణకుమార్, కమిషనర్ మహేష్, డాక్టర్ లలిత్‌సాగర్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

◗ పాముూరు: ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్‌రావు అన్నారు. పామూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నాయకులతో కలిసి నిర్వహించారు. జగన్ పాలనలో పారిశ్రామిక రంగం పూర్తిగా కుదేలైందన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, డి.ఏడుకొండలు, జేసీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. తూర్పు కోడిగుడ్లపాడులో నాయకులు రూ.12 లక్షలతో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటి కుళాయి పనులు పూర్తికావడంతో పూజలు నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచి దారపనేని కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహరావు, ఎ.ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

◗ టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్ కూటమి ప్రభుత్వ పాలనను వివరించారు. సర్పంచి పిడుగురాళ్ల శేషమ్మ, కాకుమాని సుబ్బారావు, శ్రీనివాసరావు, సురేష్, దామచర్ల శ్రీను, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల ఉత్సాహం



దర్శి: కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

దర్శి నియోజకవర్గ స్థాయి పాఠశాల ఫెడరేషన్ క్రీడలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఉల్లాసంగా సాగాయి. అయిదు మండలాల పరిధిలో 550 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవి పోటీలను ప్రారంభించగా 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముండ్లమూరు మండలం ఈదర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ తోడ్పాటుతో క్రీడా దుస్తులు సమకూర్చారు. వీటిని గొట్టిపాటి లక్ష్మి నివాసం వద్ద పంపిణీ చేశారు. సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ అరుణ తెలిపారు. సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని మహాలక్ష్మి తెలిపారు. –న్యూస్‌టుడే, దర్శి, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం

కష్టపడితేనే ఫలితం



తాళ్లూరు పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో బాలికలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఎస్సై ఎస్.మల్లికార్జునరావు సూచించారు. పట్టుదలగా చదివితే మంచి ఫలితాలు సాధించగలుగుతారని వివరించారు. తాళ్లూరులోని వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ◗ పీసీపల్లి: విద్యార్థి దశ నుంచే కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్సై జి.కోటయ్య అన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 'భవిష్యత్తుకు బాటలు' అనే అంశంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల ఆశయానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలిగి తోటివారికి సాయపడేలా ఆలోచించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విహారం.. విజ్ఞానం



సిమ్స్ పార్క్ వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సి.ఎస్.పురం మండలంలోని శీలంవారిపల్లి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దక్షిణ భారతదేశ విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. ఇందులో భాగంగా కర్ణాటకలోని మండ్యా వ్యవసాయ కళాశాలలో వీసీ ఫామ్, తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ, కొడైకెనాల్, సిమ్స్ పార్క్ తదితర ప్రాంతాలను సందర్శించారు. మండ్యాలో వీసీ ఫామ్‌ను సందర్శించి అక్కడి పరికరాలను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. ఈ యాత్ర ద్వారా విజ్ఞానం పెంపొందించుకున్నట్లు విద్యార్థినులు తెలిపారు. -న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

అంతటా చెత్త.. కానరాని సంపద

◗ వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో స్వచ్ఛ లక్ష్యానికి తూట్లు



వెన్నూరు ఎస్సీ కాలనీ రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడంతో పాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలనే లక్ష్యంతో 2014-19 కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసింది. పల్లెల్లో చెత్త సేకరణకు రిక్షాలను సమకూర్చి, హరిత రాయబారుల పేరుతో పారిశుద్ధ్య కార్మికులను సైతం నియమించింది. అప్పట్లో రోజువారీ చెత్త సేకరణతో గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉండేవి. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ లక్ష్యానికి తూట్లు పొడిచింది. సంపద కేంద్రాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారి పిచ్చిమొక్కలు, చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. కొన్ని చోట్ల మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వినియోగంలోకి తెచ్చి, పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



పెరిదేపిలోని సంపద తయారీ కేంద్రం చుట్టూ పెరిగిన చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు

కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో..

నియోజకవర్గ కేంద్రమైన కొండపి మండలంలో 19 పంచాయతీలు ఉన్నాయి. అన్నింటిలోనూ సంపద తయారీ కేంద్రాలను గత తెదేపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి నిర్మించింది. తడి-పొడి చెత్తను వేర్వేరుగా ఇళ్ల నుంచి సేకరించేందుకు, రెండు చెత్త డబ్బాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత హరిత రాయబారులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో ఇంటింటా చెత్త సేకరణ నిలిచిపోయింది. రూ.లక్షల నిధులతో కొనుగోలు చేసిన రిక్షాలు మూలకు చేరాయి. చెత్త సేకరణ సరిగా జరగకపోవడంతో వ్యర్థాలను రోడ్లపైనే ప్రజలు వేస్తుండడంతో తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. టంగుటూరు మండలంలోని ఓ గ్రామంలో అయితే ఏకంగా చెత్త డబ్బాలను పంపిణీ చేయకుండా సచివాలయంలోనే చాలా రోజులు ఉంచేశారు. సంపద కేంద్రాల నిరుపయోగంపై ఎంపీడీవో రమణమూర్తిని వివరణ కోరగా.. ప్రస్తుతం షెడ్ల వద్ద నున్న పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించే పనులు చేపడుతున్నామని, త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

మహిళా శక్తి చాటిన ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక, బీసీ సంఘాల నాయకులు

కనిగిరి, న్యూస్‌టుడే: మహిళా శక్తిని చాటి చెప్పిన స్వాతంత్ర్య సమర యోధురాలు చాకలి ఐలమ్మ అని అఖిల భారత దోబీ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవూరి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని ప్రాంతీయ రజక సంఘం కార్యాలయంలో ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలిచి అందరినీ ఏకం చేసిన ఘనత ఆమెదేనని కొనియాడారు. తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక, బీసీ సంఘాల నాయకులు బొప్పరాజు సుబ్బారావు, పల్లా మాలకొండయ్య, చింతపూడి వాసు, ఈర్ల విజయరామరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కనిగిరి: కనిగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయాధికార్లకు పంట జీవిత దశలు, చీడపీడల నివారణ, సూక్ష్మ పోషక లోపాలపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణిచ్చారు. ఆత్మా పీడీ ఎం.సుబ్రహ్మమణ్యేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ సిబ్బంది రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు ఇవ్వాలన్నారు. జిల్లా వనరుల సమన్వయకర్త ఎస్.రామోమహన్ మాట్లాడుతూ.. వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. దర్శి కేవీకె కోఆర్డినేటర్ రమేష్, ఎస్ఎంఎస్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏవో శేషయచ్య, కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఇ.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

భూ వివరాల్లో తప్పులుంటే సరిచేయండి



తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో 50 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని పట్టా భూములు(ఫ్రీ హోల్డ్)గా అధికారులు మార్చారు. అందులో ఎలాంటి తప్పులు దొర్లకుండా, నిజమైన లబ్ధిదారులకే అందాయా లేదా అని విచారించారు. అవకతవకలు ఉంటే సరిచేయాలని సూచించారు. పట్టా భూముల నివేదికను తయారు చేసి జిల్లా కార్యాలయాలకు పంపాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.ఆంజనేయులు, డీటీ శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు రూ.55 వేల విరాళం

కనిగిరి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గురువారం కనిగిరి పట్టణానికి చెందిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు సీఎం సహాయనిధికి రూ.55 వేలు విరాళాన్ని జిల్లా అధ్యక్షులు ఎం.సాయిప్రణీత్‌కు అందజేశారు. అసోయేషన్ సభ్యులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వరదల కారణంగా ఎందరో ఇబ్బందులు పాలయ్యారని, అందుకే మా వంతుగా సాయం అందజేసినట్లు తెలిపారు

విద్యార్థుల చదువుకు ఉపాధ్యాయుల తోడ్పాటు

సి.ఎస్.పురం: చెన్నపునాయునిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న మారుమూల అటవీ గ్రామమైన మైలుచర్లకు చెందిన విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఉపాధ్యాయులు ఆటోను ఏర్పాటు చేశారు. రవాణా ఖర్చుల నిమిత్తం ఒక నెలకు సంబంధించి రూ.11,000 నగదును అందించారు. ఈ చెక్కును సముదాయ అధ్యక్షుడు ఆర్.హనుమంతరావు గురువారం ఆటో చోదకుడు మౌలాలికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాంద్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం

కనిగిరి: బదిలీపై వెళ్తున్న కనిగిరి ఫారెస్ట్ రేంజర్ రామిరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవిలకు గురువారం స్థానిక ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం యూనిట్ కార్యాలయంలో ఘన సన్మానం జరిగింది. సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు మండ్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాల విజయవంతానికి వినతి

దర్శి: ఈ నెల 29న ఒంగోలులో జరిగే గిరిజన ఉద్యోగుల సంఘం (ఏఐఎస్టీఏ) వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నరేంద్ర కోరారు. దర్శిలో సంఘ ప్రాంతీయ మండలాల సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో సాంబశివరావు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల కొట్లాట.. ఒకరిపై కేసు నమోదు

దర్శి: మండలంలోని తిమ్మాయిపాలేనికి చెందిన ఇసుకపల్లి పెదకొండయ్య, వెంకటనరసయ్య సోదరులు. గత మంగళవారం వెంకటనరసయ్య ఇంటికి వెళ్లే మార్గంలో ఆయన సోదరుడు ముళ్లకంప, రాళ్లు అడ్డుపెట్టారు. ఈ క్రమంలో జరిగిన గొడవలో పెదకొండయ్య, ఆయన కుమారుడు రమేష్‌లు కర్రతో నరసయ్యపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◗ మోటార్లు, విద్యుత్తు తీగల చోరీ : జరుగుమల్లి: మండలంలోని కె.బిట్రగుంట గ్రామానికి చెందిన కె.శ్రీదేవి తన పొలంలో ఇటీవల బోరు వేయించారు. రూ.35 వేలు ఖర్చు చేసి మోటార్ ఏర్పాటు చేశారు. మోటార్, విద్యుత్తు తీగలను దుండగులు చోరీ చేశారు. మరికొందరు రైతులవి కూడా చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో పది మంది రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉల్లి.. రోజు రోజుకీ పైపైకి...!



న్యూస్‌టుడే, కనిగిరి

మూడు నెలలుగా ఉల్లి ధర దిగిరానంటోంది. ఆగస్టులో కిలో రూ.38 ఉన్న రేటు ప్రస్తుతం రూ.60లకు వరకు చేరింది. దీనికి తోడు కనిగిరి దర్శి, పామూరు, పొదిలి తదితర ప్రాంతాల్లో నాసిరకం ఉల్లిపాయలు తెచ్చి అధిక రేట్లకు విక్రయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే కర్నూలు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దిగుమతి తగ్గిపోయిందని, అందుకే రేట్లు పెరిగి పోయాయని వ్యాపారులు, దుకాణాదారులు చెబుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలో రోజూ ఆరు లారీల వరకు హోల్ సేల్ దుకాణాలకు ఉల్లి పాయలు దిగుమతి అవుతాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎక్కడికక్కడే విపరీతంగా రేట్లు పెరిగి పోయాయి. ఆయా ప్రాంతాల నుంచి ఉల్లి రవాణా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి నెలకొంటే మరి కొంత రేటు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గేదేలే అంటున్న కూరగాయలు..



ఇంట్లో నిత్యం ఏ కూర చేసుకోవాలన్నా ఉల్లి వాడాల్సిందే. అదే పరిస్థితి కూరగాయలది. ఉల్లి వెంటే మేమంటూ కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగి పోయాయి. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావం.. ఇప్పుడేమో అధిక వర్షాల కారణంగా ఉత్పత్తి తగ్గి ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి తగ్గింది. దీంతో కూరగాయల ధరలు సైతం విపరీతంగా పెరిగి పోయాయి. టామాటా ఈ నెల మొదటి వారంలో రూ.28లు ఉంటే ప్రస్తుతం రూ.60లు పలుకుతోంది. క్యారెట్ రూ.80, చిక్కుళ్లు రూ.100లకు చేరుకున్నాయి. వంగ, కాకర, బీర, దొండ, బంగాళ దుంపలు సైతం రూ. 50లకు తగ్గేదేలే అన్నట్లు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ఉల్లి, కూరగాయల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నపునాయునిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న టి.చెంచిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద రూ.1.50 లక్షల చెక్కును ఎంఈవో జగన్నాథం ప్రసాదరావు గురువారం మృతుని కుమారుడు ప్రదీప్‌రెడ్డికి అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటరావు, షేక్, పథకం కన్వీనర్ ఎన్.తిరుపతయ్య, మండల గౌరవాధ్యక్షుడు జి.వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెంచిరెడ్డి కుమారుడికి చెక్కు ఇస్తున్న ఎంఈవో ప్రసాదరావు

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

తప్పైపోయింది... క్షమించండి!

ఒంగోలు నేరవిభాగం, నాగులుప్పలపాడు - న్యూస్‌టుడే: ఈ నెల 20న మద్దిరాలపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' సభా ప్రాంగణం సమీపంలోని దుకాణం వద్ద... చింతల వెంకట్రావు అనే వ్యక్తి పర్సు పోగొట్టుకున్నారు. అక్కడ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి ఓ కానిస్టేబుల్ దానిని తీసినట్లుగా భావించి తెలియజేశారు. ఈ నేపథ్యంలో సదరు వీడియోను జిల్లా పోలీసు కార్యాలయంలోని పెద్ద స్క్రీన్‌పై పలుమార్లు పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ కూల్‌డ్రింక్ తాగి దాన్ని అక్కడ కింద పెట్టినట్లుగా గుర్తించారు. ఆ ప్రాంతంలో ఎటువంటి పర్సు లేదని.. అదెక్కడో మరోచోట పడిపోయి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. సదరు కానిస్టేబుల్ తప్పేమీ లేదని గుర్తించారు. ఫిర్యాదుదారు వెంకట్రావును గురువారం జిల్లా కార్యాలయానికి పిలిపించి ఆ దృశ్యాలను చూపారు. దీంతో వెంకట్రావు క్షమాపణ కోరారు. పోలీసుల ప్రతిష్ఠ దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు.

త్వరితగతిన పీఎంశ్రీ పనులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎం శ్రీ పథకంలో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. విద్యాశాఖ ప్రగతిపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదటి దశలో చేపట్టిన పనులు అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలోనూ రాజీ పడరాదన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో-2లు సమన్వయం చేసుకుంటూ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈవో సుభద్ర, డిప్యూటీ డీఈవో సుబ్బారావు, ఏపీవో మాధవీలత, డీసీఈవో ప్రమోద, ఏఎంవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మకు కొత్త అందం



గత వైకాపా ప్రభుత్వం గుండకమ్మ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీస నిర్వహణ లేక రెండు గేట్లు కొట్టుకుపోయి జలాశయం పూర్తిగా అడుగంటింది. ఆయకట్టు రైతులు రెండేళ్లు పంట కోల్పోగా... వేలాది మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వర్షాలతో పాటు సాగర్ జలాలు వచ్చి చేరడంతో జలాశయం కొత్తకళ సంతరించుకుంది. గతంలో మోడు వారిన చెట్లపై నేడు ఇలా పక్షులు చేరి కనువిందు చేస్తున్నాయి.

- ఈనాడు, ఒంగోలు

అయిదేళ్ల కష్టాలకు ఇక చెల్లు



గతంలో శిర్డీసాయి మందిరం వద్ద పరిస్థితి

త్రోవగుంట నుంచి 216 జాతీయ రహదారిని కలిపే మార్గమిది. ఒంగోలు నుంచి బీరాల వైపు వెళ్లే వందలాది మంది వాహనదారులు నిత్యం ఈ రోడ్డు లోంచే రాకపోకలు సాగిస్తుంటారు. కీలకమైన ఈ దారి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేయడంతో నిండా గోతులతో అధ్వానంగా తయారైంది. వర్షాలకు వాటిలో నీరు చేరి తరచూ ప్రమాదాలూ చోటుచేసుకునేవి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక... సమస్య తీవ్రత దృష్ట్యా ఈ రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో వాహనదారుల ఇబ్బందులు తీరాయి.



ప్రస్తుతం రూపు మారిందిలా..

వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిత

మద్దిపాడు, న్యూస్‌టుడే: సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శివరామయ్య పేర్కొన్నారు. మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తులో ఉన్నతంగా రాణించగలరని పేర్కొన్నారు. ర్యాగింగ్, సామాజిక మాధ్యమాల దుర్వినియోగంతో కలిగే అనర్థాలు తెలియజేశారు. క్రమశిక్షణగా మెలిగి మంచి స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సచివాలయ మహిళా పోలీస్ సుజాత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగిరిలో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్జిత సేవల రుసుముల చెల్లింపునకు డిజిటల్ విధానం అందుబాటులోకి తెచ్చినట్లు ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త రామకృష్ణారావు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గురువారం ఈ సేవలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'క్షుద్ర పూజలు అవాస్తవం'

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రుద్రవరంలోని అంకమ్మ దేవస్థానంలో ఈ నెల 22న రాత్రి క్షుద్ర పూజలు జరిగాయన్న ప్రచారం నిజం కాదని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు అంకమ్మరాజు, తన్నీరు శ్రీనివాస్ తెలిపారు. ఆ రోజు సాధారణ పూజలే నిర్వహించారని... కొందరు వ్యక్తులు కావాలనే దుష్ప్రచారం చేశారని పేర్కొన్నారు. శాస్త్ర ప్రకారమే ఆలయ నిర్వహణ కొనసాగుతోందని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

బకాయిలు రూ.12 కోట్లు.. బాధ్యులెవరు!

- అమృత్ కుళాయిల్లో గత పాలకుల చేతివాటం
- ఇప్పుడు కొత్త కనెక్షన్ల మంజూరుపై ప్రతికూల ప్రభావం

న్యూస్‌టుడే - ఒంగోలు నగరం

కుళాయి కనెక్షన్ల మంజూరులో గత పాలకులు చూపిన చేతివాటం... నగరవాసులకు ఇప్పుడు కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది. పాత వాటినే కొత్తగా వేసినట్లు చూపి కేంద్రం ఇచ్చిన నిధులు మింగేశారు. దీంతో డిపాజిట్ మొత్తాలు వసూలు కాక దాదాపు రూ.12 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఇది కొత్త కనెక్షన్ల మంజూరుపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

అవకతవకలు సాగాయిలా...

అమృత్ పథకంలో భాగంగా నగరాలు, పట్టణాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ క్రమంలోనే ఒంగోలు కార్పొరేషన్‌కు నాలుగేళ్ల క్రితం రూ.3 కోట్లు కేటాయించింది. బీపీఎల్ పరిధిలోని పేదలకు రూ.200కే కనెక్షన్ ఇవ్వాలి. ఇతర కేటగిరీల వారికి ముందు కుళాయి మంజూరు చేసి... తరువాత ఎనిమిది సులభ వాయిదాల్లో రూ.6,900 డిపాజిట్ వసూలు చేయాలని నిర్ణయించారు. నగరంలో 6,500 గృహాలకు కుళాయిలు వేయాలన్నది లక్ష్యం. ఆ మేరకు 5,900 వేసినట్లు దస్త్రాల్లో చూపారు. అసలు మతలబంతా ఈ లెక్కల్లోనే ఉంది. చాలా మందికి కొత్తగా కనెక్షన్లు ఇవ్వలేదు. అప్పటికే ఉన్న పాత కుళాయిలనే కొత్తగా వేసినట్లు చూపి నిధులు మెక్కేశారు. దస్త్రాల ప్రకారం వారంతా కొత్త కనెక్షన్లు పొందినట్లు ఉన్నా... వాయిదాల రూపంలో డిపాజిట్ చెల్లించాలన్న విషయం చాలా మంది గృహస్థులకు తెలియదు. దీంతో చాలా మంది నెలవారీ బిల్లు రూ.60 మాత్రమే చెల్లిస్తున్నారు. సిబ్బంది సైతం డిపాజిట్ జోలికి వెళ్లకపోవడంతో...



నగరంలోని ఫిల్టరేషన్ ప్లాంట్

గత నాలుగేళ్లుగా ఆ బకాయిలు పేరుకుపోయి ప్రస్తుతం రూ.12 కోట్లకు చేరింది.

అన్ని విధాలా నష్టం...

కుళాయిల కనెక్షన్లలో అవకతవకలపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు సిబ్బంది, అధికారులతో పాటు... స్థానిక వైకాపా పాలక పెద్దలకూ ఈ వ్యవహారంలో భాగస్వామ్యం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. వాయిదాల ప్రకారం డిపాజిట్ సొమ్ము వసూలు బాధ్యతను రెవెన్యూ విభాగానికి అప్పగించినా వారు పెద్దగా పట్టించుకోలేదు. గత నాలుగేళ్లలో కేవలం 15 మంది మాత్రమే వాయిదాలు చెల్లించారు. ఈ బకాయిలు వసూలైతేనే అమృత్ పథకం కింద వచ్చే అయిదేళ్లలో మరో 6,500 కుళాయిలు మంజూరుకు వీలవుతుంది. పాలకవర్గం, అధికారులు ఈ విషయమై దృష్టి సారించకపోవడంతో నిధులు కొరత ఏర్పడి... తాగునీటి సరఫరాలో తలెత్తే చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కరించలేని దుస్థితి నెలకొంది. ఈ విషయమై కార్పొరేషన్ ఎంఈ జానీని వివరణ కోరగా... ఇటీవలే కమిషనర్ సమీక్షించి వాయిదాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇంటి పన్నుతో కలిపి డిమాండ్ నోటీసులు పంపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

మైనార్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మైనార్టీలకు అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో శ్రీలత పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. పక్కాగృహాలు, స్వయం ఉపాధి రుణాలు తదితర 15 పథకాలకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలన్నారు. జిల్లా అధికారి నారాయణ, నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సహ చట్టంతో పారదర్శక పాలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టం-2005పై ఉద్యోగులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ ఒంగోలు ఏడీఏ బి.రమేష్‌బాబు పేర్కొన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఉద్యోగులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సమాచారం నిమిత్తం వచ్చే దరఖాస్తులకు స్పందించి... నిర్దేశిత గడువులోగా వివరాలు అందజేయాలన్నారు. ఈ చట్టంతో పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని తహసీల్దార్ కె.వాసుబాబు తెలిపారు. ఏవో కిషోర్ పాల్గొన్నారు.

నూకసానికి అభినందనల వెల్లువ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నూకసాని బాలాజీని... భాగ్యనగర్‌లోని తెదేపా పార్లమెంట్ కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

28, 29 తేదీల్లో ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు తెలిపారు. 28న చీమకుర్తిలోని గిరిజన గురుకులంతో పాటు... కొప్పోలు-చింతల మధ్య నక్కలకాలనీ, కొత్తపట్నం మండలం రంగాయపాలెం యానాది కాలనీలోని పునరావస కేంద్రాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రకాశం భవన్‌లో అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. 29న ఉదయం అంబేడ్కర్ భవన్‌లో జరగనున్న అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ సమావేశంలో పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా అడుగులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సంక్షేమ పాలన ఎలా ఉంటుందో చేతల్లో చూపామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరంలోని 30వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గద్దలగుంట నుంచి భాగ్యనగర్ వెళ్లే రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. నిధులు అందుబాటులో ఉన్నందున ప్రాధాన్య క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మేయర్ గంగాడ సుజాత, భాజపా నియోజకవర్గ కన్వీనర్ యోగయ్య యాదవ్, ఉప మేయర్ వేమూరి బుజ్జి, తెదేపా నాయకుడు గుర్రాల రాజ్‌విమల్ తదితరులు పాల్గొన్నారు.

ఇది సంక్షేమ ప్రభుత్వం... : చీమకుర్తి, న్యూస్‌టుడే: కొత్త కుమ్మరిపాలెం సచివాలయం పరిధిలోని వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో పురపాలక సంఘం మేనేజర్ పోతురాజు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. తెదేపా నాయకులు చలమయ్య, మైనారిటీ విభాగం ప్రతినిధి షేక్ మోమిన్, సయ్యద్ బాజీ, కౌన్సిలర్ ఎం.సులోచన యల్లయ్య, జనసేన నాయకులు నాగరాజు, శివ, శ్రీరామ్ పాల్గొన్నారు.

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఈవోపీఆర్డీ కొండపి రఘుబాబు అధ్యక్షతన అన్నంగిలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడారు. వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించారు. ఇళ్ల స్థలాలు, విద్యుత్తు మీటర్లు, బీసీ కాలనీలో కాలువల నిర్మాణం అంశాలను స్థానికులు ప్రస్తావించారు. తహసీల్దారు సుజన్‌కుమార్, సర్పంచి లోకేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటసుజాత, గ్రామ కమిటీ అధ్యక్షుడు అనిల్, వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, గోపీచంద్, శివకృష్ణ, శ్రీను, హనుమంతరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి: గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్



శిద్దా హనుమంతరావును సత్కరిస్తున్న ఎంఈవో వెంకారెడ్డి

దాత తోడ్పాటు... ఎమ్మార్సీకి హంగులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మండల విద్యావనరుల కేంద్రం కొత్త హంగులద్దుకుంది. వ్యాపారవేత్త శిద్దా హనుమంతరావు వితరణతో ఈ పనులు చేపట్టారు. దెబ్బతిన్న కిటికీలు, తలుపులు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. ఇతర మరమ్మతులూ చేపట్టి భవనానికి రంగులు వేశారు. యాబై కుర్చీలు సైతం అందజేశారు. మొత్తంగా రూ.మూడు లక్షలు వెచ్చించి ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దాతను ఘనంగా సత్కరించారు. ఆయన సేవా భావాన్ని ఎంఈవో వెంకారెడ్డి కొనియాడారు. మాజీ సర్పంచి ఆర్.అంకారావు, ప్రధానోపాధ్యాయిని నల్లూరి ఉమామహేశ్వరి, పి.స్వప్నరాజు, కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు, ఎం.తిరుపతిరెడ్డి, చంద్రమౌళి, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్తు డీఈఈగా పాండురంగారావు



ఒంగోలు గ్రామీణం: విద్యుత్తు శాఖ ఒంగోలు నగర డీఈఈగా కేవీ పాండురంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీటీ మీటర్స్ డీఈఈగా ఉన్న ఆయనను ఈ స్థానానికి బదిలీ చేశారు. పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటివరకు ఆ స్థానంలో ఉన్న వినయ్‌కుమార్‌రెడ్డి బదిలీపై దర్శి వెళ్లారు.

1,027 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు అర్బన్: ఒంగోలు ఒకటో వేలం కేంద్రంలో గురువారం... చీమకుర్తి నుంచి 1,341 పొగాకు బేళ్లను వేలంలో నిలపగా వ్యాపారులు 1,027 కొనుగోలు చేశారు. కిలో గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠం రూ.170 పలికింది. సూపరింటెండెంట్ రవికాంత్ పర్యవేక్షించారు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే

సమస్య: నగరంలోని పలు ప్రాంతాల్లో వేగ నిరోధకాలు ఎత్తుగా నిర్మించడంతో... ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.
- ప్రసాదరావు, సీనియర్ సిటిజన్

సమస్య: రైల్వే స్టేషన్ సమీపంలోని ఘోష్ రోడ్డులో బోర్‌వెల్ చుట్టూ వ్యర్థాలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి వినియోగానికి వీలు కావడం లేదు. - జి.వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి... పై రెండు సమస్యలను పరిష్కరిస్తాం. - జానీ, మున్సిపల్ ఇంజినీర్

చీమకుర్తి, న్యూస్‌టుడే:

సమస్య: చీమకుర్తి తహసీల్దారు కార్యాలయం మలుపు నుంచి గాంధీనగర్ మొదటి వీధికి వెళ్లే మార్గంలోని కొన్ని వీధి దీపాలు, బస్టాండ్ కూడలిలోని రెండు దీపాలు గత కొద్ది రోజులుగా వెలగడం లేదు. - ఎస్.ఆంజనేయులు, ఎన్.సుబ్రహ్మణ్యం, పట్టణవాసులు

సమాధానం: శుక్రవారమే ఆయా దీపాలకు మరమ్మతులు చేపట్టి... సమస్య పరిష్కరిస్తాం.
- గోపి, ఇంజినీరింగ్ పర్యవేక్షకుడు

మద్దిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మద్దిపాడులోని బీసీ, వడ్డెర కాలనీల్లో పగలు రాత్రన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి.
- వి.నాగరాజు, గ్రామస్థుడు

సమాధానం: పరిశీలించి దీపాల నిర్వహణ పక్కాగా సాగేలా చర్యలు తీసుకుంటాం. - చెన్నారెడ్డి, ఏఈ

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. బధిరుల సంకేత భాషా దినోత్సవాన్ని ఒంగోలులోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతుల జీవన ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. క్రీడల్లో ప్రోత్సహించేలా విశాఖపట్టణంలో రూ.200 కోట్లతో 30 ఎకరాల్లో జాతీయ విభిన్న ప్రతిభావంతుల క్రీడల ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్బారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని 50 మంది విభిన్న ప్రతిభావంతులకు ఎన్.హెచ్.ఎఫ్.డీ.సీ పథకం కింద రూ.1.46 కోట్ల విలువైన చెక్కులు అందజేశారు.



లబ్ధిదారుకు పత్రం అందజేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొండచిలువ కలకలం



ఆర్‌ఎల్‌పురంలోని ఓ పొగాకు బ్యారన్ వద్ద గురువారం రాత్రి ఓ కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన దారపునేని వెంకట్రావుకు చెందిన ఆ బ్యారన్‌లో... లారీల్లో పనిచేసే కొందరు సిబ్బంది నివాసముంటున్నారు. వారు వంట చేసుకునే సమయంలో పది అడుగులకు పైగా పొడవున్న కొండ చిలువ... అక్కడి మంచినీటి కుండను చుట్టుకుని ఉండడాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. యజమాని సహకారంతో పోలీసు, అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

పీవీఆర్‌లో 'ఉత్తమ విద్యార్థి' పురస్కారాలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం... ఉత్తమ విద్యార్థి (బెస్ట్ స్టూడెంట్) అవార్డులు అందజేశారు. సంస్థ గౌరవాధ్యక్షుడు చింతలపాటి లక్ష్మీనారాయణ గత మూడేళ్లుగా వీటిని అందజేస్తున్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు రావడం, యూనిఫాం ధరించడం, ఉపాధ్యాయులకు విధేయులుగా ఉంటూ చదువులో రాణిస్తున్న వారిని ఎంపిక చేశారు. ఈసారి సీహెచ్ చతుర్వేది, ఎం.రిషికుమార్‌లను ఎంపిక చేసి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. వారి తల్లిదండ్రులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని రాధిక, లక్ష్మీనారాయణ, అరుణశ్రీ, ఉపాధ్యాయులు రామయ్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న అక్కినేని కళాపరిషత్ ప్రతినిధులు



పార్థివదేహం వద్ద అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత తదితరులు

మాజీ ఎంపీ పార్వతమ్మకు నివాళి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ కన్నుమూయడంతో పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. నెల్లూరులోని నివాసంలో ఉన్న ఆమె పార్థివదేహాన్ని ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుమల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బీఎన్.విజయకుమార్; దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల తెదేపా బాధ్యులు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబు, నగర మేయర్ గంగాడ సుజాత, పలువురు కార్పొరేటర్లు సందర్శించి అంజలి ఘటించారు.

అద్దె చెల్లించని దుకాణాల జప్తు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: దామోదరం సంజీవయ్య కూరగాయలు, చేపల మార్కెట్‌లో అద్దెలు చెల్లించని వారి దుకాణాలను గురువారం జప్తు చేశారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం సిబ్బంది ఈ చర్యలు తీసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ... బకాయిలు చెల్లించకపోతే దుకాణం స్వాధీనం చేసుకొని తిరిగి వేలం నిర్వహిస్తామన్నారు. మొదటి అర్ధ సంవత్సరం పన్నుల చెల్లింపునకు ఇంకా నాలుగు రోజులే గడువు ఉన్నందున ఆస్తి, నీటి పన్నుల బకాయిలు చెల్లించాలని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

బయట చెత్త వేయకుండా... : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా... బహిరంగ మల, మూత్ర విసర్జన చేసే ప్రాంతాల్లోని గోడలపై వివిధ రకాల బొమ్మలతో పాటు... అందరినీ ఆలోచింపజేసేలా నినాదాలు రాయించారు. హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ బాబ్జి పాల్గొన్నారు.